


# చోటు

## కొల్లూరి సోమశంకర్

అది క్రీస్తుశకం **2055**వ సంవత్సరం. విహారి ఇంటినుంచి ఒక బిల్డర్ ఆఫీసుకి బస్‌లో ప్రయాణిస్తున్నాడు. బస్‌లో "జరగండి, ముందుకు జరగండి." అంటూ జనాలు తోసుకుంటున్నారు. ఎక్కడా అంగుళం కూడా ఖాళీ లేదు. ఈ బస్సే కాదు, అన్ని బస్సులు, రైళ్ళు, విమానాలు అన్నీ జనాలతో నిండిపోతున్నాయి. విహారికి చిరాగ్గా ఉంది. ఇంత మంది జనంలో అతడికి ఊపిరి ఆడడంలేదు. వీళ్ళంతా రోజూ ఎక్కడెక్కడ తిరుగుతారో అర్థం కాలేదు విహారికి. కిటికీలోంచి బయటకు చూడసాగాడు. అన్నీ అపార్టుమెంట్లే. బస్ ట్రాఫిక్ జామ్‌లో ఇరుక్కుంది. విహారి ఆలోచనల్లోకి జారుకున్నాడు.

***

దేశంలో అభివృద్ధి సాధనాలు ఎన్ని కల్పించినా, దేశస్థులకి అవి సరిపోవడం లేదు. అభివృద్ధి ఫలాలు అందరికీ అందడం లేదు. ప్రజల మధ్య ఉన్న అంతరాలు మరీ పెరిగిపోతున్నాయి. దేశమంతా ఎన్నో ఫ్యాక్టరీలు స్థాపించారు. నగరమంతా నున్నటి, విశాలమైన రోడ్లు. కాని ఎక్కడ ఒక్క చెట్టుకూడా కనిపించడం లేదు. ఎక్కడ చూసినా జనమే జనం! దేశంలో ఇప్పుడు కేవలం రెండే తరగతులు- ఉన్నవాళ్ళు, లేనివాళ్ళు! బిపిఓలు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పుణ్యమా అని 'మధ్యతరగతి' అదృశ్యమైపోయింది. డబ్బున్నవాళ్ళు కొంతమంది ఎంతధర పోసైనా స్థలాలు కొనుక్కుని, 'డూప్లెక్స్ హౌస్'లు కట్టుకుంటున్నారు. ఇంకొంతమంది అపార్టుమెంట్లు కట్టి అద్దెలకిస్తున్నారు. వాళ్ళ ఇళ్ళల్లో కంప్యూటర్, ఇంటర్‌నెట్, కేబుల్ తప్పనిసరిగా ఉంటున్నాయి. ఇళ్ళు విశాలమే అయినా, హృదయాలు మాత్రం కుంచించుకుపోతున్నాయి. లేని వాళ్ళు ఏ మురికివాడల పక్కనో కాలనీలు ఏర్పాటు చేసుకుంటున్నారు.

ఇప్పుడన్నీ బాల్కనీ మొక్కలే. చెట్లులేవు. పక్షులు లేవు. తినడానికి పనికిరాని జంతువులు నశించిపోయాయి. స్వచ్ఛమైన గాలి కావాలంటే 'ఆక్సిజన్ కేఫ్'కి వెళ్ళాల్సిందంతే. కొంతమంది తమ స్థలాలలో ఇళ్ళు కట్టకుండా, ఓ పదేళ్ళపాటు మొక్కలను పెంచారు. అవి ఇప్పుడు చెట్లవడంతో, అక్కడ సేదదీరాలని వచ్చేవారివద్దనుంచీ గూబలదిరే ఛార్జీలు వసూలు చేస్తున్నారు. ఒకప్పుడు నదులు, వాగులు ప్రవహించిన మార్గమంతా నేడు మోడల్ కాలనీలు, మల్టీప్లెక్స్ థియేటర్లతోను నిండిపోయింది. ప్రజలకు వినోదమే గాని ఆహ్లాదం లభించడం లేదు. ఇప్పుడంతా 'కాన్డ్ ఫుడ్డే'. అంబలి కూడా 'టిన్స్' లో దొరుకుతోంది. ఏ పండగకో, పబ్బానికో కూరగాయలతో వంటలు చేసుకుంటున్నారు. వాటికైనా వేలాది రూపాయలు పోయాల్సిందే. పిల్లలు ఆడుకోవాలంటే కనీసం రెండువందల కిలోమీటర్ల దూరం వెళ్ళాల్సిందే.

భారతదేశంలో ఇటువంటి పరిస్థితి వస్తుందని ముందే ఊహించిన అగ్రరాజ్యం చంద్రగ్రహం మీద, అంగారక గ్రహం మీద ఆవాస ప్రాంతాలు ఏర్పాటు చేసిన ఇంటర్‌నెట్ ద్వారా అమ్మకానికి పెట్టింది. చంద్రుడి పై ప్లాట్లను, అమెరికన్లు, స్తోమత ఉన్న భారతీయులు వేలం వెర్రిగా కొనుగోలు చేసారు. ఇప్పుడు చంద్రగ్రహం పూర్తిగా మానవులతో నిండిపోయింది. అక్కడ కొత్తగా ఎవరినీ స్థిరపడనివ్వడం లేదు. ఎవరైనా చుట్టపు చూపుగా వెళ్ళిరావడమే! వీసా గడువుని చాలా ఖచ్చితంగా అమలు చేస్తున్నారు. అందుకని అందరి చూపు ఇప్పుడు అంగారక గ్రహంపై పడింది. అంగారకుడిపై నీటిజాడ తెలియగానే అగ్రరాజ్యం జాగ్రత్తపడి, అక్కడి భారీగా మొక్కల పెంపకం చేపట్టింది. కొన్నేళ్ళు గడిచేసరికి అక్కడ భూమిలో డెబ్బయి శాతం మేర అడవులు తయారయ్యాయి. ఇదంతా ఇంటర్‌నెట్ ద్వారా విస్తృతంగా ప్రచారం చేసింది. చంద్రుడిపై చోటు సంపాదించలేని వాళ్ళు కనీసం అంగారకుడి మీదైనా స్థలం సంపా

దించాలని తెగ తాపత్రయ పడుతున్నారు. ఇప్పుడు విహారి కూడా అక్కడ ప్లాట్లను అమ్మే ఆఫీసుకే వెడుతున్నాడు.

***

ఇంటర్‌నెట్ ద్వారా అమ్మగా మిగిలిన ప్లాట్లను నేరుగా కొనుక్కోడం కోసం నేడే ఆఖరు రోజు. విహారి అక్కడికి చేరేసరికి అక్కడ పెద్దలైను ఉంది. ఇంకా కౌంటర్ తెరవలేదు. క్యూలో నిలుచున్న వాళ్ళంతా ఒకరినొకరు తోసుకుంటున్నారు. కొట్టుకుంటున్నారు. బూతులు తిట్టుకుంటున్నారు. కొన్నేళ్ళ క్రితం 'చిరంజీవి' అనే హీరో నటించిన సినిమాలు విడుదలైనప్పుడు ఇలాగే క్యూలో నిలబడి కొట్టుకునేవారట! విహారి కూడా క్యూలో నిలుచున్నాడు. తన వంతు కోసం నిరీక్షిస్తున్నాడు. రెండు గంటలైనా కౌంటర్ తెరవలేదు. పలుకుబడి ఉన్నవాళ్ళు, ఆఫీసు లోపలికి వెళ్ళిపోయి డబ్బు కట్టేసి, ప్లాట్లు పొందినట్లు రసీదులు తెచ్చేసుకుంటున్నారు. పదహారు గంటలు గడిచాక కౌంటర్ వద్దకి చేరుకున్నాడు విహారి. తీరా డబ్బులు తీసి ఇవ్వబోయేసరికి, ''కన్‌ఫార్మ్‌డ్ ప్లాట్లు లేవు. ఆర్. ఎ.సి ప్లాట్లు ఉన్నాయి. ఇష్టమైతే తీసుకోండి'' అని చెప్పాడు కౌంటర్‌లోని వ్యక్తి.

''ఏదో ఒకటి ఇవ్వండి. అంగారకుడి మీద కాస్త చోటు దొరికితే చాలు.'' అన్నాడు విహారి. డబ్బులు తీసుకుని ఒక ప్రింటవుట్ ఇచ్చాడు కౌంటర్‌లోని వ్యక్తి. 'అమ్మయ్య' అనుకుంటూ ఇల్లు చేరాడు విహారి. భార్యకి ఈ విషయం చెప్పి సంతోషించాడు.

''మొత్తానికి అంగారకుడి మీద ప్లాటు సంపాదించాను. ఇకపైన మనకి ఇక్కడ కూరగాయలకి మంచి డిమాండు వస్తుందని పేపర్లో వేసారు. నేనక్కడ 'ఫాం హౌస్' ఏర్పాటు చేసి కూరలు పళ్ళు పండిస్తాను. 'ఎక్స్‌ప్రెస్ పార్శిల్' ద్వారా పండిన పంటని ఇక్కడికే పంపిస్తాను. నువ్వు ఇక్కడ వ్యాపారం చెయ్యి.'' అంటూ తన ప్రణాళికని వివరించాడు.

''ఎప్పుడు బయల్దేరాలి?'' అని అడిగిందామె.

''ఇంకా మూడు నెలల టైం ఉందిలే.'' చెప్పాడు విహారి.

ఇదే సమయంలో అంగారకుడిపై గ్రహాంతర వాసుల జాడ కనిపెట్టినట్టు అగ్రరాజ్యం ప్రకటించింది. వారి భాషని డీకోడ్ చేసాయని, ఆ భాషను రెండు నెలల్లో నేర్చుకోవచ్చని తెలిపింది. ఎందుకైనా మంచిదని విహారి కూడా ఆ భాష నేర్చుకున్నాడు. విహారి అంగారకుడి పైకి వెళ్ళే రోజు రానే వచ్చింది.

అందరితో పాటు విహారి కూడా 'స్పేస్ షటిల్' ఎక్కాడు. ఒకటిన్నర రోజు తర్వాత అది అంగారకుడిపై దిగింది. కస్టమ్స్, ఇమ్మిగ్రేషన్ వ్యవహారాలు ముగించుకుని తన స్థలం వైపు వెళ్ళాడు. తీరా వెళ్ళి చూసే సరికి అక్కడ అప్పటికే ఎవరిదో ఇల్లు ఉంది. చుట్టూ పెద్ద ప్రహరీ గోడ ఉంది. కాలింగ్‌బెల్ కొట్టి ఇంటి యజమానిని పిలిచాడు విహారి.

''ఈ స్థలం నాది. మీరెలా ఇల్లు కట్టారు?'' అని అడిగాడు.

''ఎవడ్రా నువ్వు. నాస్థలం నీదంటున్నావు? ఒళ్ళెలా ఉంది?'' అంటూ అరిచాడు ఇంటి యజమాని.

''మర్యాదగా మాట్లాడండి. నేనీస్థలం అగ్రరాజ్యం ఏజంటు ''డుష్ బిల్డర్స్'' దగ్గర కొన్నాను. ఇవిగో డాక్యుమెంట్లు...'' అంటూ పత్రాలు తీసి చూపించాడు విహారి.

''అమ్మడానికి వాడెవడు, కొనడానికి నువ్వెవరు? ఎక్కువగా మాట్లాడితే ముక్కలు విరగదంతాను! నోర్మూసుకుని ఇక్కడినుంచి పో'' అని అన్నాడు ఇంటి యజమాని.

''మీ మీద ఫిర్యాదు చేస్తాను'' అంటూ స్థానిక పోలీస్ స్టేషన్‌కి వెళ్ళాడు విహారి. కాని అక్కడ తన లాంటివాళ్ళే మరికొంతమంది కనపడ్డారు. ఒకే స్థలాన్ని, ఒకరికి తెలియకుండా మరొకరికి, పది మంది దాకా అమ్మినట్లు తేలింది. విహారి భోరుమన్నాడు. అయితే అతడి ఏడుపుని ఎవరూ పట్టించుకోలేదు. ఇంతలో దూరం నుంచి ఎవరో తనని పిలుస్తున్నట్లు అనిపించి అటు ఇటు చూసాడు విహారి. దగ్గరలోని ఒక తోటలోంచి ఒక గ్రహాంతరవాసి తనని పిలుస్తున్నాడు. అటువైపు నడిచాడు విహారి.

అక్కడ తన లాగే మోసపోయిన వాళ్ళంతా గొడవ చేస్తున్నారు. విహారి కూడ వాళ్ళతో చేరి నినాదాలు వేయసాగాడు. ఆ స్థలం యజమానినని చెప్పుకుంటున్న వ్యక్తి రౌడీలని పిలిపించి, వీళ్ళందరిని బలవంతంగా తీసుకెళ్ళి, భూమికి వెళ్ళే షటిల్‌లో కూర్చోబెట్టాడు. అందరూ ఏడుస్తూ కూర్చున్నారు. షటిల్ బయల్దేరింది. వేగం పుంజుకుంటున్న సమయంలో. తలుపు తోసుకుని బయటకు దూకేసాడు విహారి.

''రండి. కాసేపు ఇక్కడ చల్లగాలి పీల్చుకోండి. ఆ తర్వాత అన్ని విషయాలు మాట్లాడుకుందాం.'' అని అన్నాడు గ్రహాంతర వాసి. కాసేపు సేద దీరిన తర్వాత జరిగిన సంగతంతా వివరించాడు విహారి.

''అసలు మీరంతా ఇక్కడికి ఎందుకు వస్తున్నారు?'' అని అడిగాడు గ్రహాంతర వాసి.

''మా దేశంలో మాకు చోటు తగ్గిపోతోంది. అందుకని దూరమైనా, ఇక్కడిదాకా రావల్సి వచ్చింది'' చెప్పాడు విహారి.

''మా నాన్న చెబుతూండేవారు. వందేళ్ళ క్రితం భారతదేశంలో గ్రామాలు ఉండేవట. చెట్లు, చేమలు, వాగులు, వంకలు, చెరువులు, నదులతో దేశం కళకళలాడేదట. బోలెడు ఖాళీ స్థలాలు ఉండేవట. మరిప్పుడో? గజం ఖాళీ స్థలం కనిపిస్తే చాలు అక్కడో అపార్టుమెంటు కట్టేస్తున్నారు. అడవులు హరించుకుపోయాయి. జీవ నదులు ఎండిపోయాయి. ఇదంతా మీ స్వయంకృతాపరాధం!...'' అన్నాడు గ్రహాంతరవాసి.

''కాని, అభివృద్ధిలో అదంతా భాగం.'' చెప్పాడు విహారి.

''అభివృద్ధి పేరుతో మీరు ప్రకృతిని నాశనం చేసారు. ప్రకృతి ఎప్పుడైనా ఎవరికి ఎంత కావాలో అంతే ఇస్తుంది. బంగారు గుడ్లన్నింటిని ఒకేసారి పొందాలనే దురాశతో బాతుని కోసేసిన కథ నీ చిన్నప్పుడు వినే ఉంటావు. అలాగే ఉంది మీ పరిస్థితిప్పుడు.'' అన్నాడు గ్రహాంతరవాసి.

''నేనిప్పుడు ఏం చేయాలి?'' అని అడిగాడు విహారి విసుగ్గా.

''మీ దేశానికి తిరిగి వెళ్ళు. వెంటనే మొక్కలని నాటడం ప్రారంభించు. నీ తరంలో కాకపోయినా, కనీసం నీ మనవడి తరానికి ఒక అడవి తయారవుతుంది. అందరూ చెట్లను కాపాడండి. భూమి మీద కాలుష్యం తగ్గించే ప్రయత్నం చేయండి. మీ మనసులలో సాటివారికి కాస్త చోటివ్వండి...'' చెప్పాడు గ్రహాంతరవాసి.

''చెప్పడానికి ఇవన్నీ బాగుంటాయి. అయినా నా ఒక్కడి వల్ల ఏమవుతుంది? ఇదంతానాకెందుకుగాని, నా స్థలం సంగతి ఏమైందో చూడాలి.'' అంటూ అక్కడి నుంచి లేచి తన స్థలం వద్దకి చేరాడు విహారి. అక్కడ తన లాగే మోసపోయిన వాళ్ళంతా గొడవ చేస్తున్నారు. విహారి కూడ వాళ్ళతో చేరి నినాదాలు చేయసాగాడు. ఆ స్థలం యజమానినని చెప్పుకుంటున్న వ్యక్తి రౌడీలని పిలిపించి, వీళ్ళందరిని బలవంతంగా తీసుకెళ్ళి, భూమికి వెళ్ళే షటిల్‌లో కూర్చోబెట్టాడు. అందరూ ఏడుస్తూ కూర్చున్నారు. షటిల్ బయల్దేరింది. వేగం పుంజుకుంటున్న సమయంలో, తలుపు తోసుకుని బయటకు దూకేసాడు విహారి. కాని అంచనా తప్పి, సమతల ప్రదేశంలోకి కాకుండా ఓ లోయలోకి జారిపోసాగాడు....

***

మంచం మీద నుంచి జారిపడ్డాడు విహారి. తనెక్కడ ఉన్నాడా అని చూసుకున్నాడు భూమి మీదే, భరతదేశంలోనే, హైద్రాబాదులోనే, తన ఇంట్లోనే ఉన్నట్లు గ్రహించాడు. కాలెండర్‌కేసి చూసాడు. తేదీ పది, అక్టోబరు 2005 అని చూపిస్తోంది. టైం చూసుకున్నాడు. తెల్లవారు జామున మూడు గంటలవుతోంది.

''ఇదంతా కల అన్నమాట! ఇప్పుడు కాకపోయినా, భవిష్యత్తులో ఈ కల నిజం కావచ్చు. అందుకని భూమిని కాపాడాలంటే నా వంతు ప్రయత్నం నేను చెయ్యాలి. కలలో గ్రహాంతరవాసి చెప్పినట్లు ప్రకృతి పరిరక్షణకి పాటుపడాలి.'' అని అనుకున్నాడు విహారి. మంచినీళ్ళు తాగి మళ్ళీ నిద్రలోకి జారుకున్నాడు.

★